నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# వికారాబాద్

బుధవారం 6 డిసెంబర్ 2023
WEDNESDAY, DECEMBER 6, 2023

VIKARABAD

పేజీలు : 8
PAGES




## కొడంగల్‌లో..

కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి నివాసం ముందు బాణాసంచా కాల్చుతున్న కాంగ్రెస్ శ్రేణులు

# కాంగ్రెస్ శ్రేణుల సంబురం

### రేవంత్‌రెడ్డిని సీఎంగా ప్రకటించడంతో మిన్నంటిన వేడుకలు

కొడంగల్, డిసెంబర్ 5 : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సీఎంగా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించడంతో కొడంగల్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు అంబరాన్నంటాయి. మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దల సుదీర్ఘ చర్చల అనంతరం కొడంగల్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డిని సీఎంగా ప్రకటించడంతో రెండు రోజుల ఉత్కంఠకు తెర పడింది. దీంతో కొడంగల్‌లో పటాకులు, బాణాసంచాలు కాల్చారు. కొడంగల్ నియోజకవర్గం 1952లో ఏర్పడగా 1969లో జరిగిన ఎన్నికల్లో కొడంగల్ స్థానం నుంచి అచ్యుతారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందగా ఆయనకు మంత్రి పదవి వరించింది. ఈసారి ఏకంగా సీఎం పదవి కొడంగల్‌ను వరించడంపై నియోజకవర్గ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# ధాన్యం కొనుగోళ్లు షురూ..

- రంగారెడ్డి జిల్లాలో 33 కొనుగోలు కేంద్రాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటికే 5,098 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ.. రైతులకు రూ.67 లక్షల చెల్లింపులు
- నేటి నుంచి వికారాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు షురూ..
- జిల్లావ్యాప్తంగా 1.33 లక్షల ఎకరాల్లో వరి సాగు, 122 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- 2.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- అందుబాటులో 35 లక్షల గన్నీ బ్యాగులు

8వ పేజీలో...

ఈ వానకాలం ఉమ్మడి జిల్లాలో వరి పంట పుష్కలంగా పండింది. రంగారెడ్డి జిల్లాలో 33 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, ధాన్యం సేకరణ ముమ్మరంగా సాగుతున్నది. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. సరిపడా గన్నీ బ్యాగులను సైతం అందుబాటులో ఉంచారు. 87వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా, ఇప్పటివరకు 5,098 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, రైతుల ఖాతాల్లో రూ.67 లక్షల నగదును జమ చేశారు. వికారాబాద్ జిల్లాలో నేటి నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది. జిల్లావ్యాప్తంగా 122 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈసారి 2.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకు 56 లక్షల గన్నీ బ్యాగులు అవసరం కాగా, ప్రస్తుతం 35 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే ధాన్యం 'ఏ' గ్రేడ్ రకం క్వింటాలుకు రూ.2203, సాధారణ రకం రూ.2183గా మద్దతు ధరను నిర్ణయించింది. ధాన్యాన్ని విక్రయించిన రైతులకు రెండు, మూడు రోజుల్లో నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులను జమ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈసారి జిల్లాలో 1.33 లక్షల ఎకరాల్లో వరి సాగైంది.

– వికారాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ)



- రంగారెడ్డి జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న ముసురు
- పొలాలు, కల్లాల్లోనే వరి ధాన్యం.. ఆందోళన చెందుతున్న రైతాంగం
- ఓ వైపు చిరు జల్లులు.. మరోవైపు పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- పెరిగిన చలి తీవ్రతతో గజగజ వణికి పోతున్న జిల్లావాసులు

మిగ్‌జాం తుఫాన్ ప్రభావం రంగారెడ్డి జిల్లాపై పడింది. అసలే చలి కాలం.. దీనికితోడు రెండు రోజులుగా ముసురు కురుస్తున్నది. చేతికొచ్చిన వరి పంట పొలాలు, కల్లాల్లో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పాటు చలిగాలులు వీస్తుండడంతో జిల్లావాసులు గజగజ వణికిపోతున్నారు. నేడు, రేపు వర్ష ప్రభావం తీవ్ర రూపం దాల్చనుండడంతో ధాన్యం తడిసిపోతుందని రైతులు భయపడుతున్నారు. కవర్లు, టార్పాలిన్లతో ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

– రంగారెడ్డి, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ)

8వ పేజీలో...

# తుఫాన్.. పరేషాన్



ఇబ్రహీంపట్నంలో తడిసిన ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టుకున్న రైతులు